


టీ-హబ్‌లో నిలిచిన టెస్టులపై ఆరా

సంగారెడ్డి అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన 'టీ-హబ్‌లో నిలిచిన టెస్టులు' కథనంపై సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ స్పందించారు. టీ-హబ్‌లో రసాయనాలు ఎప్పుడు ఖాళీ అయ్యాయి? కొత్తగా ఇండెంట్ ఎప్పుడు పెట్టారు? సరఫరా కాకపోవడానికి గల కారణాలేమిటి? అని టీ-హబ్ నిర్వహకుడిని అడిగి తెలసుకున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు సూపరింటెండెంట్ వివరణ ఇచ్చినట్టు వైద్యశాఖ వర్గాలు తెలిపాయి.

కోలుకునేదాక వైద్య శిబిరం

- తండావాసులెవరూ ఆందోళనపడొద్దు
- డీఎంహెచ్‌వో గాయత్రీదేవి



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గాయత్రీదేవి

కల్హేర్, మే 17 (ఆంధ్రజ్యోతి): తండావాసులెవరూ ఆందోళనకు గురికావొద్దని, రోగులు పూర్తిగా కోలుకునేవరకూ వైద్య శిబిరం కొనసాగిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి గాయత్రీదేవి అన్నారు. గత సిర్గాపూర్ మండలం రూప్లాతాండాలో గత పదిహేను రోజులుగా ప్రజలు చికున్‌గున్యా లక్షణాలతో ఇబ్బందులు పడుతున్నారన్న విషయమై న్యూస్ ఛానళ్లు, దిన ప్రతికల్లో వార్తలు రావడంతో స్పందించిన ఆమె శనివారం తండాను సందర్శించారు. గిరిజనులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుచూ తండాలో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. శుక్రవారం ఇంటింటి సర్వే జరిపించగా ఎనిమిది మందికి కీళ్ల నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నట్లు తేలిందన్నారు. అలాగే అనిత అనే మహిళ రక్త నమూనాలను సేకరించి సంగారెడ్డిలోని ల్యాబ్‌కు పంపించగా ఆమెకు చికున్‌గున్యా లక్షణాలు లేవని తేలిందన్నారు. మరికొందరికి కూడా పరీక్షలు జరిపించామని, ఫలితాలు రావాల్సి ఉందని తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సంధ్యారాణి, కంగ్టి వైద్యాధికారిణి నాగమణి, వైద్య సిబ్బంది జట్ల భాస్కర్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.





కొండాపూర్‌లో భూసమస్య పరిష్కార పత్రాలు అందజేస్తున్న మంత్రులు పొంగులేటి, దామోదర, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అన్నిరకాల భూసమస్యలకు పరిష్కారం

- కొండాపూర్ భూభారతి సదస్సులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం : మంత్రి దామోదర
- సదస్సులో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, మే 17 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం ద్వారా అన్ని రకాల భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన భూభారతి పైలెట్ ప్రాజెక్టు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో 32 మండలాలను పైలెట్ ప్రాజెక్టు మండలాలుగా ఎంపిక చేశామని, అందులో కొండాపూర్ ఒకటని చెప్పారు. త్వరలోనే ఈ మండలంలోని గ్రామాల్లో భూసమస్యలు పరిష్కారమవుతాయని, అదే విధంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ భూభారతిని క్షేత్రస్థాయిలో అమలు చేస్తామని వివరించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ పంకజ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అయ్యో పాపం

- సంగారెడ్డి ఎంసీహెచ్ పార్కింగ్‌లో ఆడ శిశువు లభ్యం
- ఎస్ఎన్‌సీయూకి తరలించి చికిత్స

సంగారెడ్డి అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): తాజాగా అభం శుభం తెలియని ముక్కుపచ్చలారని ఓ ఆడ శిశువును నిర్ధాక్షిణ్యంగా మండుటెండలో వదిలివెళ్లిన సంఘటన సంగారెడ్డి జిల్లాకేంద్రంలో శనివారం చోటు చేసుకున్నది. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలోని వాహనాల పార్కింగ్ మధ్యలో మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో ఓ శిశువు ఏడ్పు వినిపించింది. అక్కడే కొద్ది దూరంలో ఉన్న అమ్మఒడి(102)వాహనాల సిబ్బంది దీన్ని గమనించి వెళ్లి చూసేసరికి అక్కడ నేలపై పడుకోబెట్టిన పసికందు కనిపించింది. దీంతో వెంటనే ఆస్పత్రి అధికారులకు సమాచారమందించారు. శిశువును వెంటనే ఎంసీహెచ్‌లోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం(ఎస్ఎన్‌సీయూ)కు హుటాహుటిన తరలించారు. శిశువు 20 రోజుల నుంచి నెల రోజుల వ్యవధిలోపే జన్మించి ఉండవచ్చని వైద్యులు భావిస్తున్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ తెలిపారు. నిపుణుల పర్యవేక్షణలో అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఆడ శిశువు లభ్యమైన విషయాన్ని సంగారెడ్డి పట్టణ పోలీసులతో పాటు ఐసీడీఎస్, శిశుగృహ అధికారులకు సమాచారం అందించామన్నారు. లభ్యమైన శిశువు సంగారెడ్డి ఎంసీహెచ్‌లో జన్మించలేదని గుర్తించినట్టు ఆయన స్పష్టం చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

జూదం.. బతుకు ఆగం

- ఈజీ మనీ మోజులో యువత.. పల్లెలు, పట్టణాల్లో జోరుగా పత్తాలాట
- పల్లెల్లో పొలాలు, అటవీ ప్రాంతాలు.. పట్టణాల్లో నివాసగృహాల మధ్యనే అడ్డాలు
- విజృంభిస్తున్న బెట్టింగ్ భూతం.. ఐపీఎల్, ఆన్‌లైన్ రమ్మీ, యాప్‌ల జోరు
- వేలు, లక్షల్లో పందేలు.. అప్పుల పాలై.. తీర్చే మార్గంలేక ఆత్మహత్యలు
- జూదానికి డబ్బు కోసం అక్రమమార్గాలు, దొంగతనాలు

జూదం జూలు విదులిస్తోంది. చదువుకుని జీవితంలో స్థిరపడాల్సిన యువత ఈజీ మనీ మోజులో వ్యవసనాల బారినపడుతున్నారు. పేకాట, బెట్టింగ్, ఆన్‌లైన్‌గేమ్స్.. అంటూ మత్తులో మునిగిపోతున్నారు. ఈ వ్యసనం ఎంతలా ముదిరిందంటే.. ఇదే ఉద్యోగంలా.. రాత్రింబవళ్లు అదే ధ్యాసలో ఉంటున్నారు. ఇంటిని, కుటుంబాన్ని పట్టించుకోకుండా కలల్లో బతుకుతున్నారు. మరోవైపు పేకాట ఓ కుటీర పరిశ్రమలా మారింది. ఆడేవారు అప్పుల పాలవుతుండగా.. క్లబ్బులు నిర్వహిస్తూ కొందరు లక్షలు గడిస్తున్నారు. ఒకప్పుడు పొలాలు, అటవీ ప్రాంతాలు, ఫాంహౌస్‌లో ఆడే పత్తాలాట ఇప్పుడు పట్టణాల్లోనే దర్జాగా సాగుతున్నది. నివాసగృహాల మధ్య ఇళ్లు అద్దెకు తీసుకుని క్లబ్బులు నడుపుతున్నారు. నమ్మకస్తులైనవారినే అనుమతిస్తూ వారికి మందు, విందు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇంటి అద్దె రోజుకు రూ.వేలల్లో.. అదనపు సౌకర్యాలకు అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

బెట్టింగ్ భూతం యువతను కబలిస్తున్నది. స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ ఉంటేచాలు ఆన్‌లైన్‌లో జూదం ఆడే వారి కోసం యాప్‌లు, వెబ్‌సైట్లు, గేమ్‌లు వందలకొద్దీ అందుబాటులో ఉన్నాయి. పేకాటలో అన్ని రకాల ఆటలు, ఆన్‌లైన్ డైస్‌గేమ్స్, నంబర్ గేమ్‌లు, లైవ్ క్యాసినో, ఆన్‌లైన్ రౌలెట్ తదితర ఆటలు ఎక్కువగా ఆడుతున్నారు. దీనికితోడు ఐపీఎల్ సీజన్ వచ్చిందంటే మూడు నెలలు అదే లోకం. ఏ టీం గెలుస్తుందో ననే కాదు.. ఓవర్ ఓవర్‌కూ.. బాల్‌బాల్‌కూ బెట్టింగ్ వేస్తున్నారు. మ్యాచ్‌ను బట్టి రెట్టింపు, ఐదురెట్లు, పదిరెట్లు ఇస్తామని ప్రకటిస్తున్నారు.

వ్యసనాలకు అలవాటుపడి యువత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. జూదంలో రూ. లక్షల్లో పోగొట్టుకుని.. పోగొట్టుకున్న చోటనే సంపాదించాలనే తపనతో ఇంకాఇంకా కూరుకుపోతున్నారు. చివరకు అప్పులపాలై.. ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యలు చేసుకుంటూ కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగులుస్తున్నారు. మరికొందరు డబ్బుల కోసం దొంగతనాలు, మోసాలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను వేధిస్తున్నారు.



జోగిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పేకాట ఆడేందుకు పొలాలు, నిర్మానుష్య ప్రదేశాలు, నిర్జన ప్రాంతంలో ఉండే ఇళ్లను స్థావరాలుగా ఎంచుకుంటున్నారు. పట్టణాల్లోనై హోటళ్లు, దుకాణాల్లో అడ్డాలు నిర్వహిస్తున్నారు. మరికొందరు నివాసగృహాల మధ్య ఏకంగా క్లబ్బులను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రోజుకు రూ. 5వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. అక్కడ నమ్మకస్తులైన వారితో బృందాలను ఏర్పాటు చేసుకుని పేకాట నిర్వహిస్తున్నారు. ప్రతీ టేబుల్‌కు కొంత చొప్పున కమిషన్ వసూలు చేస్తున్నారు. వచ్చేవారికి మందు, విందుతో పాటు సకల సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పేకాట నిర్వహణతో కొందరు లక్షలు గడిస్తున్నారు. జిల్లాకేంద్రమైన సంగారెడ్డి, పటాన్‌చెరు, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో ఇలా క్లబ్‌రూంలను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

బెట్టింగులు.. ఆన్‌లైన్ గేమ్‌లు

ఒకప్పుడు జూదం అంటే నలుగురు చేరి డబ్బులు పెట్టి ఆడేవారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్, కంప్యూటర్ లోనే బెట్టింగ్ నడుస్తున్నది. ఐపీఎల్ క్రికెట్, కేపీఎల్ కబడ్డీ, ఆన్‌లైన్ రమ్మీ, క్యాసినో, గేమ్స్, గ్యాంబ్లింగ్ ఆడుతున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఆన్‌లైన్ జూదం స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్

మిగతా 8వ పేజీలో



సప్తాహలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

- బాణాపూర్‌లో ముగిసిన సప్తాహ
- వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలు

8లో

అకాల వర్షం.. ఆగమాగం

6లో

- తడిసిన ధాన్యం.. కూలిన వృక్షాలు



గూడ్స్ రైలులో మంటలు..

6లో

- తృటిలో తప్పిన ప్రమాదం

ఆడుకునేందుకు వెళ్లి పిడుగుపాటుకు బలి

- ఇద్దరు పిల్లల మృతితో పడాలపల్లిలో తీవ్ర విషాదం
- కన్నీరు మున్నీరైన మృతుల కుటుంబాలు

6లో

ప్రభుత్వ భూముల కబ్జా.. పట్టాల దర్జా

కబ్జాపర్వం - 4

- ఇస్నాపూర్‌లో ఇరవయ్యేళ్ల క్రితం పేదలకు ఇచ్చిన పట్టాలు పక్కదారి
- అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ప్లాట్ల విక్రయాలు



ఇస్నాపూర్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలు

రామచంద్రాపురం టౌన్ మే 13 (ఆంధ్రజ్యోతి): కంచే చేను మేస్తున్న చందంగా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారు. అక్రమార్కులను పూర్తిస్థాయి హక్కుదారులుగా చేసే పత్రాలు సృష్టిస్తున్నారు. కిందిస్థాయి మున్సిపల్ సిబ్బందితో పాటు రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఈ పనులు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. పాతకాలంనాటి పట్టాలు వెలికి తీసి కబ్జాదారుల పేర్లు రాసి అమ్మకాలు జరుపుతున్నారు. లక్షల్లో దండుకుంటున్నారు. ఫలితంగా భావితరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూమి మాయం అవుతోంది. ఇస్నాపూర్ పట్టణంలో ఈ దందా జోరుగా సాగుతున్నది.

ఇళ్ల స్థలాలకు డిమాండ్

పటాన్‌చెరు నియోజకవర్గంలోని పరిశ్రమల్లో పనిచేసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది వలసవచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఇస్నాపూర్, పాశమైలారం, ముత్తంగి, చిట్కుల్, రుద్రారం, క్యాసారం, నందిగామ గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. ఏళ్లుగా అద్దెలు చెల్లిస్తుండటం, చీటికీమాటికీ ఇళ్లు మారాల్సి రావడం, నిత్యం స్థానికులత గొడవలు జరుగుతుండటంతో అద్దె ఇళ్లతో విసుగెత్తిపోయారు. ఏళ్లుగా పనిచేసి వెనకేసి కొద్దిపాటి డబ్బులతో సొంతిల్లు సమకూర్చుకోవాలని తాపత్రయపడుతున్నారు. ఇలాంటివారి ఆకాంక్ష అక్రమార్కులకు వరంగా మారింది.

పాత పట్టాల పేరిట కబ్జాలు

ఇస్నాపూర్‌లో 2007లో అప్పటి తహసీల్దార్ 985 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టాలు ఇచ్చారు. వీటిలో కొద్దిమందికి మాత్రమే రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు. మిగిలిన పట్టాలను స్థానిక ప్రజాప్రతినిధులకు ఇచ్చారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులకు మంజూరైన పట్టాలను తాము అందజేస్తామంటూ కిందిస్థాయి సిబ్బంది తీసుకున్నారు. పట్టా రికార్డులపై మంజూరైన కుటుంబ సభ్యుల పేర్లు రాయకుండా ఖాళీగా ఉంచారు. ఇప్పుడు ఆయా పట్టాలపై తమకు కావాల్సిన పేర్లు రాసుకుని ఇష్టారీతిన అమ్ముకుంటున్నారు.

75 గజాలకు రూ. 10 లక్షల పైనే..

నిరుపేదలకు కేటాయించి పట్టాలపై తమకు కావాల్సినవారి పేర్లు రాసుకున్న మున్సిపల్ సిబ్బంది వాటిని ఇప్పుడు విక్రయిస్తున్నారు. అలాగే పంపిణీ చేయకుండా ఉన్న పట్టా సర్టిఫికెట్ల ఆధారంగా మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఇష్టారీతిన అమ్మకాలు జరుపుతున్నారు. 75 గజాల స్థలానికి రూ. 10లక్షల నుంచి రూ.15లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు ప్రభుత్వ భూములపైనా కన్నేశారు. పక్కనే పేదలకు కేటాయించిన భూముల పట్టా నంబర్లు వేసి ప్రభుత్వ భూములనూ విక్రయిస్తున్నారు. ఆయా స్థలాలకు పట్టా నంబర్ ఉందంటూ ఇంటి నంబర్లు కూడా స్థానిక అధికారులు మంజూరు చేస్తున్నారు. ఇలా 496 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో పెద్దఎత్తున ఆక్రమణలు వెలిశాయి. ఈ విషయంపై పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావును వివరణ కోరగా ఇస్నాపూర్‌లో ఆక్రమణలపై తమకు సమాచారం లేదని, విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

- సంగారెడ్డి జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలు
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 22వ తేది నుంచి 28 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలో జంబ్లింగ్ పద్ధతి అమలు చేయనున్నందున పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. ఆదివారం కూడా పరీక్షలు జరుగుతాయనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. పరీక్షల కేంద్రాల్లో విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లకు కూడా ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల నీడలో పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగేలా అధికారులందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఐఈవో గోవింద్‌రామ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్లేజ్.. నివేదిక అనుకూలంగా ఇవ్వరూ!

- విజిలెన్స్ అధికారుల చుట్టూ ట్రాన్స్‌కో సిబ్బంది ప్రదక్షిణలు
- వెంచర్ నిర్వాహకులను మేనేజ్ చేసేందుకు ప్రయత్నాలు


సంగారెడ్డి టౌన్, మే17 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌కోలో జరిగిన అవినీతి బాగోతంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఓ వెంచర్‌కు ఇవ్వాల్సిన కండక్టర్ వైరును బ్లాక్ మార్కెట్‌కు అమ్ముకున్న విద్యుత్ అధికారులు తమ తప్పును సరిదిద్దుకునేందుకు తంటాలు పడుతున్నారు. విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. కండక్టర్ వైరును వెంచర్‌లోనే ఏర్పాటు చేసినట్లు తమకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలంటూ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు విద్యుత్ సామాగ్రి, కండక్టర్ వైరును తమకు చేరవేసినట్లు చెప్పాలంటూ వెంచర్ నిర్వాహకులను కోరుతున్నట్లు తెలిసింది. విచారణలో తెలిసే రిపోర్టునే ఇస్తామంటూ విజిలెన్స్ అధికారులు సున్నితంగా తిరస్కరించినట్లు అధికార వర్గాలె తెలిపాయి. రెండేళ్ల క్రితం ఇవ్వాల్సిన విద్యుత్ సామాగ్రిని విక్రయించి జేబులు నింపుకోవడంపై విజిలెన్స్ అధికారులు, వెంచర్ నిర్వాహకులు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారంటూ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

టేక్మాల్, మే 17 (ఆంధ్రజ్యోతి): వాహనం బైక్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామ శివారులో శనివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన నర్సింలు(43) అనే వ్యక్తి జోగిపేట వైపు నుంచి బొడ్మట్‌పల్లి వైపు బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో తుఫాన్ వాహనం ఢీకొనడంతో నర్సింలుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.







‘భూభారతి’తో రైతులకు మేలు

- మా స్వార్థం కోసం చట్టాన్ని తేలేదు
- కొత్తగా సర్వేయర్లను నియమిస్తున్నాం.. మంత్రి పొంగులేటి
- చిలప్‌చెడ్ పేరుకే మండలం, ఒక్క ప్రభుత్వ భవనమూ లేదు: మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- ధరణితోనే భూసమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే సునీతారెడ్డి


చిలప్‌చెడ్ రైతు వేదిక ప్రాంగణంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలప్‌చెడ్, మే 17(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టాన్ని మా స్వార్థం కోసం తీసుకురాలేదని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతుల మేలు చేసేందుకే తెచ్చామని రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌరసరఫరాల శాఖల మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. 18 రాష్ట్రాల రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలకే ముఖ్యమైన అంశాలతో భూభారతిని తయారు చేసినట్లు తెలిపారు. ఎక్కువగా భూములకు బౌండరీలు, మ్యాప్‌లు లేని కారణంగానే సమస్యలు తలెత్తుతాయన్నారు. భూ భారతి చట్టంలో సర్వేచేసి మ్యాపులు ఇచ్చి పాస్ బుక్‌లో అప్‌లోడ్ చేస్తే శాశ్వతంగా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. భూ భారతి చట్టాన్ని నిర్లక్ష్యం చేసినా, రైతులను ఇబ్బంది పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో 32 మండలాల్లో భూ భారతి చట్టం తీసుకు వచ్చామని జూన్ 2న దాని ఫలితాలు ప్రజలకు అందుతాయన్నారు. ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు పరిష్కరించాలన్నిది ఈ చట్టం ముఖ్య ఉదేశమన్నారు. ఈ రోజు సాయంత్రం వరకు 6000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 10956 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. పేదవారికి ఇల్లు నిర్మించాలన్న ధృఢ సంకల్పంతో రాష్ట్రంలో మొదటి విడతగా 4,50,000 ఇండ్లు ఇస్తున్నామన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ చిలప్‌చెడ్ మండలం పేరుకే మండలమని, ఇక్కడ ఒక్క ప్రభుత్వ భవనం కూడా లేదన్నారు. గత ప్రభుత్వం ధరణితో రైతులను గోస పెట్టిందని, ఇప్పుడున్న ప్రభుత్వమైనా అలా జరగకుండా చూడాలన్నారు. ఆధార్ కార్డు ఇచ్చినట్లే రైతులకు భూధార్ కార్డు ఇవ్వడం మంచిపరిణామన్నారు. చిన్న చిన్న సమస్యలకు రైతులు కోర్టుకు వెళ్తున్నారని, ఇప్పటికే 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూ భారతిలో సమస్యలు పరిష్కరింపబడితే 2 కోట్ల కేసులు తగ్గుతాయన్నారు. ఎమ్మెల్యే సునితారెడ్డి మాట్లాడుతూ.. గతంలో ధరణిలో చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. సాదాబైనామా కింద దరఖాస్తులు పెట్టుకున్నా వారికి భూ భారతిలో అవకాశం ఇవ్వాలని కోరారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ చిలప్‌చెడ్ మండలాన్ని రెవెన్యూ వివాద రహితంగా తీర్చి దిద్దుతామన్నారు. 16 రెవెన్యూ గ్రామాల నుంచి దాదాపు 1000 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సహదేవ్, డీటీ సింధూజ, ఎంపీడీవో ఆనంద్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కౌడిపల్లి, మే (ఆంధ్రజ్యోతి) 17: చిలప్‌చేడ్ మండలానికి వెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మండల పరిధిలోని అంతారం గేట్ సమీపంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు.


మంత్రి పొంగులేటితో మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి, నాయకులు

అకాల వర్షం..ఆగమాగం

- కూలిన వృక్షాలు.. తడిసిన ధాన్యం



తూప్రాన్‌లో కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు, వెంకటాయపల్లిలో రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

తూప్రాన్/చిన్నశంకరంపేట/వెల్దుర్తి, మే 17(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో అకాల వర్షం రైతులను ఆగమాగం చేసింది. శనివారం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురియడంతో రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్న వరి ధాన్యం కొట్టుకుపోయింది. బలమైన ఈదురు గాలులకు పెద్ద చెట్లు నేలకొరిగాయి. వివరాల్లోకి వెళ్తే.. తూప్రాన్ మండలంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘాలతో కమ్ముకొని ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. తూప్రాన్ పట్టణ శివారులోని హైవే బైపాస్‌లో రైతుల సర్వీసు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో రైతులు తొలగించుకున్నారు. తూప్రాన్ పట్టణంలోని ఏబీ కాలనీలో విద్యుత్ వైర్లు తెగిపోయి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా చిన్నశంకరంపేట, వెల్దుర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది.

- శివ్వంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు చేతికొచ్చిన వరి ధాన్యం తడిసి మొలకెత్తిందని శనివారం మండల పరిధిలోని పిల్లుట్ల రైతులు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని ఇప్పించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

గూడ్స్‌లో రైలులో మంటలు


మిర్జాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలులో మంటలను చల్లార్పుతున్న ఫైర్ సిబ్బంది

చిన్నశంకరంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ రైలులో శనివారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రైల్వే అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఆర్పడంతో ప్రమాదం తప్పింది. రైల్వే అధికారుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం రామగుండం నుంచి రాయచూరుకు బొగ్గు లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలు బయలుదేరింది. ఈ క్రమంలో గూడ్స్ మిర్జాపల్లి రైల్వే స్టేషన్ చేరుకోగానే మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో రైలు భోగిల నుంచి మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. రైలును రైల్వే స్టేషన్లో నిలిపివేసి, కామారెడ్డి రైల్వే ఫైర్ సిబ్బందికి సమాచారమందించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహాయంతో మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని రైల్వే అధికారులు తెలిపారు. కాగా వాతావరణం వేడి తీవ్రతతో ఇలాంటి ఘటనలు జరుగుతాయన్నారు. గూడ్స్ రైలు ఐదు గంటలకు రాయచూరుకు బయలుదేరింది.

‘మహీంద్రా’లో అగ్నిప్రమాదం


స్టోర్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జహీరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహీంద్రాకర్మాగారంలో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. కర్మాగారం ఆవరణలో ఎకరాస్థలం విస్తీర్ణంలో ఉన్న స్టోర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడి ప్రమాదం చోటుచేసుకున్నది. కర్మాగారంలో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఐదు ఫైర్‌ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. రాత్రి 12గంటల నుంచి తెల్లవారు జామువరకు మంటలను ఆర్పేందుకు అధికారులు యత్నించారు. కాగా పెద్దఎత్తున నష్టం జరిగినట్లు కంపెనీవర్గాలు, స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదం రాత్రిపూట జరగగా, అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

ఆడుకునేందుకు వెళ్లి పిడుగుపాటుకు బలి

- ఇద్దరు పిల్లల మృతితో పడాలపల్లిలో తీవ్ర విషాదం
- కన్నీరు మున్నీరైన మృతుల కుటుంబాలు


మృతి చెందిన ప్రసాద్, యశ్వంత్


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవికిరణ్ ఆరోగ్యపరిస్థితిపై వివరాలను తెలుసుకుంటున్న అధికారులు

తూప్రాన్, మే 17(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లిలో పిడుగుపాటుకు గురై ఇద్దరు చిన్నారుల మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. వేసవి సెలవులు రావడంతో చిన్నారులు పడాలపల్లికి చెందిన పంబాల ప్రసాద్ (15), నడిపల్లి యశ్వంత్ (13), మొకద్దం రవి కిరణ్ (12) గ్రామానికి వచ్చారు. శనివారం గ్రామశివారులో వారు మరికొంతమందితో కలిసి క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో చెట్టుకింద చేరిన ముగ్గురు చిన్నారులు పిడుగుపాటుకు గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మొకద్దం రవికిరణ్ తీవ్ర గాయాలకు గురయ్యాడు. రవికిరణ్‌ను మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా మృతి చెందిన చిన్నారులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి, శవాలను కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తూప్రాన్ ఆసుపత్రి వద్దకు విచ్చేసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 10వేల చొప్పున అందజేశారు.

కూలీ పనులు చేస్తూ..

పడాలపల్లికి చెందిన పంబాల లక్ష్మి కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులు, ఓ కూతురును పోషిస్తూ చదివిస్తున్నది. పిల్లల చిన్నతనంలో భర్త ముత్యాలు మృతి చెందాడు. చిన్న కుమారుడు ప్రసాద్ ఇటీవలే పదవ తరగతి పూర్తి చేసుకున్నాడు. పిడుగుపాటుకుగురై మరణించడంతో లక్ష్మి రోదనలు మిన్నంటాయి.

పుత్ర శోకం..

పడాలపల్లికి చెందిన నడిపల్లి లక్ష్మీఐలయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కొడుకు గతంలో మృతి చెందాడు. శనివారం పిడుగుపాటుకు పెద్ద కొడుకు యశ్వంత్ (13) మృతిచెందాడు. యశ్వంత్ ఇటీవల 8వ తరగతి పూర్తయ్యింది. కొడుకు మృత్యువాత పడటంతో కుటుంబంలో శోకాన్ని మిల్చింది.

బైకుల దొంగ అరెస్ట్.. వాహనాలు స్వాధీనం


బైకుల దొంగ అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

జహీరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): బైకుల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం పట్టణంలోని పస్తాపూర్‌కమాన్ వద్ద పోలీసులు వాహన తనఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బీదర్‌కు చెందిన కైలాష్ ద్విచక్రవాహనం(టీఎస్15-ఈజీ7502)పై జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు బయలుదేరాడు. అతడిని ఆపి తనిఖీ చేయగా వాహనానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని చెప్పాడు. అనుమానించిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా రెండు ద్విచక్రవాహనాలు(ఏపీ28-బీటీ8124, టీజీ08-సీ4094) సైతం దొంగిలించినట్టు కైలాష్ అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనంచేసుకున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

ఆయుర్వేద ఆసుపత్రిలో డాక్టర్ నియామకం


ఆసుపత్రిలో డాక్టర్ శ్రీవాణితో కలిసి స్థానికులతో మాట్లాడుతున్న ఆయుష్ శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్. పరమేశ్వర్ నాయక్

అల్లాదుర్గం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వచ్చే నెలలో పూర్తి స్థాయిలో నియామకం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయుర్వేద, ఆయూష్ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్. పరమేశ్వర్ నాయక్ స్పష్టం చేశారు. అల్లాదుర్గం ఈ నెల 16న ‘ఈ ఆసుపత్రులకు పూర్వ వైభవం ఎప్పుడో..?’ అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గత మూడేళ్లుగా మూతపడిన మండలంలోని ఆయుర్వేద ఆసుపత్రులపై కథనానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. మూతపడిన ఆయుర్వేద ఆసుపత్రులను తెరిపించి వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం ఆయుర్వేద, ఆయూష్ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్. పరమేశ్వర్ నాయక్ స్వయంగా ముప్పారం గ్రామంలోని ఆయుర్వేద ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వచ్చే నెలలో పూర్తి స్థాయిలో నియామకం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు జూన్ నెలలో 57 మంది వైద్యులను నియమించనున్నట్టు తెలిపారు. ముప్పారంలోని ఆయుర్వేద ఆసుపత్రిలో డాక్టర్‌తో పాటు, ఓ ఫార్మసిస్టు, ఓ అటెండర్ పోస్టులను తక్షణమే భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. కాగా ముప్పారంలోని ఆయుర్వేద ఆసుపత్రిలో నూతన వైద్యురాలిగా డాక్టర్ శ్రీవాణికి అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పరమేశ్వర్ నాయక్ బాధ్యతలను అప్పగించారు. మంత్రి దామోదర రాజనర్సింహకు, సమస్యను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కరుణాకర్(ఫైల్)

గజ్వేల్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాలిగామలో శనివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిట్యాల కరుణాకర్(34) గజ్వేల్‌లోని ఓ వాటర్ ప్లాంట్‌లో పని చేసేవాడు. ఈ నెల 14న రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రోడ్డుపై పోసిన వరికుప్పలను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.



న్యూస్ బాక్స్

రాచన్నస్వామి ఆలయంలో జడ్జి పూజలు

కోహీర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం బడంపేట గ్రామంలో గల రాచన్న స్వామి ఆలయంలో శనివారం జహీరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జడ్జి ఆలయంలో పూజలు నిర్వహించారు.

హరీశ్‌రావును కలిసిన సునీతారెడ్డి

నర్సాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి శనివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ముఖ్యనేత హరీశ్‌రావును స్థానిక నాయకులు కొందరితో వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో పాటు రాష్ట్రస్థాయిలో జరుగుతున్న పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

కేతకీ హుండీ ఆదాయం రూ.29 లక్షలు

ఝరాసంగం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరస్వామికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించిన కానుకలను శనివారం ఉదయం శ్రీభమరాంబిక సేవాసమితి, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో లెక్కించారు. 75 రోజుల హుండీ ఆదాయం రూ.29 లక్షలు వచ్చినట్లు తెలిపారు.

ఎరువుల వాడకం తగ్గించాలి

తూప్రాన్/మనోహరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంటల సాగులో రసాయన ఎరువులు, క్రిమిసంహార మందుల వాడకం తగ్గించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కీటక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్‌లో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం ఏఈ‌ఓ గంగుమల్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. మనోహరాబాద్ మండలంలోని పర్కిబండ, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' నిర్వహించారు.

అంబేడ్కర్ భవనం నిర్మించాలి

మెదక్ కల్చరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవనం నిర్మించాలని, లేకుంటే మెదక్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, డీబీఎఫ్ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో టీఎన్జీవో భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని కుల సంఘాలకు భవనాలు పూర్తవుతున్నా.. అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

ఆర్థిక క్రమశిక్షణతో స్వావలంభన

జహీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు స్వశక్తితో ఎదగడంతోపాటు, ఆర్థిక క్రమశిక్షణ అత్యవసరమని ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ కార్యదర్శి సుర రాజగోపాల్‌రెడ్డి, వివేకానంద ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కోల్ ఇండియా కంపెనీ ఆర్థిక సహాయంతో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళా స్వశక్తీకరణ-నైపుణ్యాభివృద్ధి శిక్షణ మూడో విడత ముగింపు శనివారం పట్టణంలోని పస్తాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

మహిళలు మౌనాన్ని వీడి నిర్భయంగా ఫిర్యాదు చేయండి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



మహిళల భద్రత, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు మౌనాన్ని వీడి నిర్భయంగా ఫిర్యాదు చేయాని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ కోరారు. సంగారెడ్డి పట్టణంలోని ఆర్నాల్డ్ పాఠశాలలో శనివారం వివిధ పాఠశాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు మహిళల భద్రత, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై పోలీసులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల, బాలికల భద్రత కోసం షీటీం బృందాలు స్కూల్స్ కళాశాలలు, బస్టాండ్ తదితర ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిరంతరం నిఘా వేస్తూ ఆకతాయిలకు చెక్ పెడుతున్నాయన్నారు. మహిళలు మౌనాన్ని వీడి నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసేలా పిల్లలను ప్రోత్సహించాలని అన్నారు. మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే జిల్లా షీటీం నంబరు 8712656772 ఫోన్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా కానీ సమాచారమందించాలని చెప్పారు. 18 ఏళ్ల లోపు బాల, బాలికలపై జరిగే లైంగిక వేధింపులను పోక్సో కేసులుగా పరిగణించడం జరుగుతుందని, పోక్సో అత్యాచార కేసులలో భరోసా సిబ్బంది కేసు నమోదు మొదలుకొని బాధితురాలికి వెన్నంటి ఉంటూ వారిలో ధైర్యాన్ని నింపుతూ.. మెడికో లీగల్ సేవలను అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ఎస్ న్యాబ్‌ను ఏర్పాటు చేసి, జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తూ.. గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో షీటీమ్స్ ఎస్ న్యాబ్, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

గోరక్ష చట్టాలు అమలు చేయాలి

గోవును ఆరాధ్య దేవతగా పూజిస్తున్నామని, ఈ కారణంగా గోరక్ష చట్టాలు అమలు చేయాలని ఎస్పీ పరితోష్ పంకజ్‌కు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను మూసేయాలని, ఆక్రమణలో ఉన్న గోచర భూములను విముక్తి చేయాలన్నారు.

రింగ్ రోడ్డు వెంట ఉన్న ప్రతీ కాలనీకి తాగునీరు

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

● డిఫెన్స్ కాలనీలో తాగునీటి పైపులైన్ల పనులు ప్రారంభం



తాగునీటి పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గంలో ఔటర్ రింగ్ రోడ్డు వెంట ఉన్న ప్రతీ కాలనీకి నితరంతరం తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలోని అపార్ట్‌మెంట్లకు తాగునీటిని అందించేందుకు మెట్రోవాటర్ వర్క్స్ చేపడుతున్న పైపులైన్ల పనులకు శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంట కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్‌కమ్యూనిటీలు వేగంగా విస్తరిస్తున్నందున మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. ముఖ్యంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడికక్కడ మినీ రిజర్వాయర్లు, పంప్ హౌజ్‌లు, పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పదేళ్లలో తాగునీటి వసతుల కల్పనపై నియోజకవర్గంలో వందల కోట్లు ఖర్చుచేసి వసతి కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు అమరేందర్, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్‌లో పరిశోధనలతో మంచిపేరు తేవాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డిలోని ఎఫ్ఆర్ఎస్‌లో మామిడి పండ్ల ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఎఫ్ఆర్ఎస్‌లో మరెన్నో పరిశోధనలు చేసి మన రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. సంగారెడ్డిలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం సంగారెడ్డి పరిధిలోని ఫల పరిశోధన కేంద్రం (ఎఫ్ఆర్ఎస్)లో శనివారం రెండోరోజు మామిడి పండ్ల ప్రదర్శన కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ క్రాంతి మామిడి పండ్ల ప్రదర్శనను తిలకించి మాట్లాడారు. జిల్లాలో ఇంత మంచి పండ్ల పరిశోధన కేంద్రం ఉండడం మన జిల్లాకు గర్వకారణమని అన్నారు. మరిన్ని పరిశోధనలు చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా ఎఫ్ఆర్ఎస్‌ను నిలపాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫల పరిశోధన కేంద్రం ఎఫ్ఆర్ఎస్ శాస్త్రవేత్త డా.సుచిత్ర, హరికాంత్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పుల్‌కల్/అల్లాదుర్గం, మే 17 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. చౌటకూర్ మండలం శివంపేట పీఏసీఎస్ సొసైటీ ఎదుట శనివారం సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేశారు. ఆరుగాలం కష్టపడి శ్రమించి పంట పండించిన రైతన్నను అకాల వర్షం నిండా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. శివంపేట సొసైటీ అధికారులు కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు కారణమైన సొసైటీ అధికారులు, సిబ్బందిని విధుల్లోంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.సాయిలు, అందోలు డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్, సభ్యులు పాల్గొన్నారు. అకాల వర్షంతో తడిసిన వరి ధాన్యం, జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పీ.నర్సింహులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

హోరాహోరీగా 'కుస్తీ'



తలపడుతున్న మల్లయోధులు

టేక్మాల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడ్మాట్‌పల్లి గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన మల్లయోధులతో పాటు సమీపంలోని కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన పలువురు మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో మహారాష్ట్రలోని ఉద్గిరి గ్రామానికి చెందిన యాదవ్ విజేతగా నిలవగా.. అతడికి ఐదు తులాల వెండి కడియాన్ని అందజేశారు. పోటీలను తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

శివ్వంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : లైసెన్సులు లేకుండా మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టరీత్యా నేరమని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత తెలిపారు. శనివారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామపంచాయతీ ఆవరణలో మొక్క నాటి సమావేశాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలు కల్తీ కల్లు, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్, ఏఎస్ఐ సాయిలు, న్యాయవాదులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మధుశ్రీ, స్వరూప, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



చాకరిమెట్లలో వ్రతాలు నిర్వహిస్తున్న దంపతులు

శివ్వంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల గ్రామం పరిధిలోని చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో స్వయంగా వెలిసిన ప్రసిద్ధ సహకార అంజనేయ స్వామి దేవాలయంలో శనివారం సందర్భంగా ఆలయ చైర్మన్ అంజనేయ శర్మ ప్రధాన పూజారి దేవదత్త శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం విశేష సంఖ్యలో దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ సార శ్రీనివాస్, ఆలయ సిబ్బంది రామకృష్ణ, పూజారులు దేవి ప్రసాద్ శర్మ, శ్రీ వాత్సవ శర్మ భక్తులు ఉన్నారు.

'ఉపాధి పనుల్లో తప్పులు జరగకుండా చూసుకోవాలి'

సంగారెడ్డి, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల్లో తప్పులు జరగకుండా చూసుకోవాలని జిల్లా అదనపు పీడీ బాల్‌రాజ్ పేర్కొన్నారు. 2024-25కు సంబంధించి మండలంలో రూ.5 కోట్లతో చేపట్టిన 250 పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను చేపడుతున్న పాటించాల్సిన నిబంధనలను సూచించారు. అర్హులందరికీ ఉపాధిహామీ పనులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాలవారీగా చేపట్టిన పనుల వివరాలను ఎస్ఆర్పీలు సామాజిక తనిఖీలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఏపీడీ పూజ, క్యూసీ అధికారి శ్రీలత, ఎస్ఆర్పీ వెంకన్న, ఏపీవో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

అల్లాదుర్గం, మే 17 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని జాగృతి జిల్లా మాజీ అధ్యక్షుడు కృష్ణాగౌడ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గడిపెద్దాపూర్ గ్రామంలోని పలు కాలనీల్లో కొన్నాళ్లుగా తాగునీటి ఎద్దడి నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామంలోని పలు వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కృష్ణాగౌడ్ కోరారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



హన్మంత్‌రావుపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, మే 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండల పరిధి హన్మంత్‌రావుపేటలోని ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి పుస్తెమట్టెలు, వస్త్రాలు, మార్కండేయ ఆలయం నుంచి తీసుకొచ్చారు.

బాణాపూర్‌లో ముగిసిన సప్తాహ

నారాయణఖేడ్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాణాపూర్‌లోని రుక్మిణీపాండురంగ ఆలయంలో ఏడురోజుల పాటు నిర్వహించిన 22వ అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం శనివారం ముగిసింది. దీంతో చివరిరోజు హరిపాఠ్, కీర్తన, మరాఠీ, తెలుగులో భజనలు, కాకడ హారతి, గాథపూజ, గాథపూజ, తీర్థ, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

కొండాపూర్‌లో బారులుతీరిన భక్తులు

నారాయణఖేడ్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండాపూర్‌లో స్వయంభువుగా వెలసిన హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు దర్శనం కోసం బారులుతీరారు. ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమ హరాజ్ ఆశీస్సులు అందించారు. డోవూరు లొంక హనుమాన్ ఆలయానికి తోడు నారాయణఖేడ్‌లోని కల్పన హనుమాన్ ఆలయం, సిరూర్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయం, మంగల్‌పేట హనుమాన్ ఆలయాల్లోను భక్తులు దర్శనం కోసం తరలివచ్చారు.

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలు

చిన్నశంకరంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలోని రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయ పూజారి సంగమేశ్వరశర్మ నవగ్రహ, ఉత్సవ విగ్రహ పూజలు, హోమాన్ని నిర్వహించారు. ఒగ్గు పూజారులు గంగ, పుట్ట పూజలు చేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

శివ్వంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలకు అడ్డుగా పెట్టిన బండరాళ్లకు తగిలి బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని రెడ్యాతండా పంచాయతీ వెంక్యాతండాకు చెందిన బానోత్ వినోద్(28) పని నిమిత్తం మేడ్చల్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. గోమారం శివారు బ్రిడ్జి సమీపంలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం కుప్పలకు అడ్డుగా పెట్టిన బండరాయికి బైక్ తగిలి వినోద్ కిందపడిపోయాడు. నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు.

20న ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

జిన్నారం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం ఎస్టీ గురుకుల కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో మిగిలిన ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 20న ఉదయం 10 గంటలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

జూదం.. బతుకు ఆగం

5వ పేజీ తరువాయి

సౌకర్యాలతో మారుమూల పల్లెలకు చేరాయి. ఆన్‌లైన్ పలువురు యువకులు రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలవుతున్నారు. అప్పులు తీర్చే మార్గంలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు.

ఇలా అందోలు డివిజన్‌లో గత 8 నెలల్లో ముగ్గురు యువకులు బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు ఓ యువకుడు అప్పులు తీర్చడానికి పొరుగింట్లో దొంగతనానికి పాల్పడిజైలు పాలవడం గమనార్హం.

కొన్ని సంఘటనలు..

ఎనిమిది నెలల క్రితం అందోలు మండలంలోని కన్ సాన్‌పల్లికి చెందిన యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. ఇందు కోసం లోన్ యాప్‌లలో అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనపడకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

-రెండు నెలల క్రితం అందోలు పట్టణానికి చెందిన యువకుడు బెట్టింగ్‌లో రూ. 3 లక్షలు కోల్పోయి అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

-జోగిపేటకు చెందిన మరో యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడగా తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

-మండలంలోని ఎర్రారం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి అందినచోట అప్పులు చేశాడు. ఇది చాలదన్నట్లు లోన్ యాప్‌లలోనూ అప్పుడు తీసుకున్నాడు. అప్పులు తీర్చేందుకు ఏకంగా పొరుగింట్లో దొంగతనం చేశాడు. 12 తులాల బంగారం, రూ. 1.50 లక్షల నగదు చోరీ చేశాడు. పోలీసులకు దొరికి జైలు పాలయ్యాడు.

-నాలుగు రోజుల క్రితం మండల కేంద్రంలో బెట్టింగ్ విషయంలో గొడవపడి ఒక యువకుడు స్నేహితుడి తల పగులగొట్టాడు.

-కొద్ది నెలల క్రితం జోగిపేటకు చెందిన ఓ విశ్రాంత ఉద్యోగి ఇల్లు కట్టడం కోసం రూ. 35 లక్షలు సమకూర్చుకుని మనవడి ఖాతాలో ఉంచాడు. సదరు మనుమడు బెట్టింగ్ మాయలో పడి తన ఖాతాలో ఉన్న డబ్బు మొత్తం ఊడ్చేశాడు.

-అందోలు మండలంలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకోక పైసా కూడబెట్టి పదెకరాల పొలం కొన్నాడు. కొన్నేళ్ల క్రితం ఆయన కొడుకు పేకాటలో రూ. 1 కోటి నష్టపోయి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో ఆ ఉపాధ్యాయుడు కష్టార్జితమైన పదెకరాల భూమిని తెగనమ్మి కొడుకు చేసిన అప్పులు తీర్చాడు. -అలాగే జోగిపేట పట్టణానికి చెందిన ఓ వ్యాపారి బెట్టింగ్‌లో రూ. 50 లక్షలు కోల్పోయాడు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి పిల్లలు లోను కాకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. తమ పిల్లలు ఏం చేస్తున్నారు..? ఎక్కడెక్కడ, ఎవరెవరితో తిరుగుతున్నారు.. అన్న విషయాలపైనిఘా పెట్టాలి. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లలో ఏయే యాప్స్ డౌన్‌లోడ్ చేస్తున్నార్న విషయాలను గమనించాలి. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ద్వారా డబ్బులు సంపాదించాలనే ఆలోచనను మానుకోవాలి.

- అనిల్, జోగిపేట సీఐ



మోహీద్‌ఖాన్ కుమారుడి రిసెప్షన్ వేడుకల్లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్‌అలీ, జోగు రామన్న

మోహీద్‌ఖాన్ కుమారుడి రిసెప్షన్ వేడుకల్లో మాజీ మంత్రులు

నారాయణఖేడ్, మే 17 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ మోహీద్‌ఖాన్ కుమారుడి వివాహ రిసెప్షన్ హైదరాబాద్‌లోని క్లాసిక్ త్రీ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్‌అలీ, జోగు రామన్నతో పాటు నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, హైదరాబాద్ ఎంపీ ఓవైసీ, మాజీ ఎమ్మెల్యేలు విజయపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రిసెప్షన్ వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు

పరిశుభ్రతతో డెంగీ నివారణ : కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు శుభ్రతతోనే డెంగీని నివారించొచ్చని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. శనివారం రామచంద్రాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ నివారణ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. అన్ని కాలనీలు, బస్తీల్లో ఆరోగ్యశాఖ అధికారులు పర్యటించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపకమిషనర్ సురేష్‌కుమార్, ఎంటమాలజీ విభాగం ఏఈ తిరుపతయ్య, వైద్యాధికారి కల్పన, మల్లేష్, నగేష్, సంజీవ, హన్మంతు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్‌లో అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం

కల్హేర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ రక్తపోటు(హైపర్ టెన్షన్) దినోత్సవం సందర్భంగా కల్హేర్‌లో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు బీపీ చెకప్ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ జేబా షహమీమ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతీ వ్యక్తి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడని, దీనివల్ల రక్తపోటు పెరిగి గుండెపోటుకు దారితీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సీహెచ్.మాణిక్యం, ఫార్మాసిస్టు పాండు, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, రేడియాలజిస్టు శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నారాయణఖేడ్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ అన్నారు. ఖేడ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మందికి మంజూరైన రూ.8 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఖేడ్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధన్, కంగ్టి పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, మనూరు, కంగ్టి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సుభాష్‌రావు, మల్లారెడ్డి, రవి, దత్తురెడ్డి, శ్రీకాంత్, నారాయణరెడ్డి, బాపుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వారం లోపు ధాన్యం కొనుగోళ్లు పూర్తికావాలి

వెల్దుర్తి, మే 17 (ఆంధ్రజ్యోతి) : వారంరోజులలోపు ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావాలని తహసీల్దార్ బాలలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను ఆమె సందర్శించి, మాట్లాడారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. రైస్ మిల్లర్లు కూడా ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ నర్సింగ్ యాదవ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.